జగన్ గాలిలో పొత్తుల కూటమి గల్లంతు

ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి

కొత్తపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రజాభిమానం గాలిలో పొత్తులతో కూడిన టీడీపీ కూటమి కొట్టుకుపోవడం ఖాయమని సిట్టింగ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వాడపాలెం టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పచ్చిపులుసు బాబీగుప్తా, పడాల రాజు, పడాల సత్యనారాయణ, లంక నాగభూషణం, గుబ్బల ఏడుకొండలు, పప్పుల సూరిబాబు, ములగలేటి జగన్‌తో పాటు 20 మంది ఆయా పార్టీలకు రాజీనామా చేసి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా, గత టీడీపీ ప్రభుత్వ విధానాలకు భిన్నంగా సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీ రహితంగా, అర్హతే ఆధారంగా పేద, మధ్యతరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. దాంతో లబ్ధి పొందిన ప్రజలు సీఎం జగన్‌ను తమ గుండెల్లో పెట్టుకుని అభిమానిస్తున్నారన్నారు. ఎక్కడ చూసినా ప్రజాభీష్టం వైఎస్సార్ సీపీకే అనుకూలంగా ఉందన్నారు. దానికనుగుణంగానే తాము వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. పార్టీ అభ్యర్థి జగ్గిరెడ్డి విజయానికి కృషి చేస్తామని అన్నారు. ప్రతిగా జగ్గిరెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, ఆ గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సూర్యారావుపేటలో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలు భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. సార్వత్రిక ఎన్నికల వేళ కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. సూర్యారావుపేటలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కదలి ఉపేంద్ర, సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, బీసీ కులాలకు చెందిన సుమారు 100 మంది ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే పినపళ్లలో గ్రామ కమిటీ అధ్యక్షుడు విజ్జన అబ్బు, మాజీ సర్పంచ్ కోట బూరయ్య ఆధ్వర్యంలో స్థానిక గొల్లాలమ్మ గుడి వీధిలో పలువురు నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అలాగే కూటమి నేతల ప్రలోభాలతో టీడీపీలో చేరిన గణేష్ కాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మళ్లీ సర్పంచ్ నేలపూడి లావణ్య నేతృత్వంలో సొంతగూటికి చేరారు. వారందరికి కండువా వేసి పార్టీలోకి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ అభ్యున్నతి కోసం, సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకునేందుకు పార్టీలో చేరిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు.



సూర్యారావుపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతిపక్ష కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



వాడపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

విద్యాకానుక కిట్లను భద్రపరచాలి

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే విద్యా కానుక కిట్లను రూమ్‌లలో భద్రపరచి వాటిని పర్యవేక్షించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వీర వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌ను, మండల రీసోర్స్ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు పంపిణీ చేసే స్కూల్ బ్యాగ్స్, టైలు, షూలు, పుస్తకాలు తదితర సామగ్రిని అన్ని పాఠశాలలకు సరిపడా వస్తాయని వాటిని విపులంగా పరిశీలించి నమోదు చేసుకోవాలని ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, సీఆర్పీలకు సూచించారు. ఈ ఏడాది జూన్ 12వ తేదీలోగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విద్యాకానుక కిట్లను అందజేసేలా తగిన ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో స్టోరేజ్ పాయింట్లను పరిశీలించారు. విద్యాకానుక కిట్లు పాడవకుండా తగు భద్రత తీసుకోవాలని సీఆర్పీలకు సూచించారు, కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సాయిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం



అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు అమ్మవారి పూజఘటాలకు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

మొబైల్ మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

మామిడికుదురు: వేసవి సీజన్‌లో ఎండలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి దాహార్తిని తీర్చేందుకు మొబైల్ మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశామని పెదపట్నంలంక షెకీనా ఫెయిత్ హోమ్ నిర్వాహకులు యింటి రాజేష్‌బాబు తెలిపారు. షెకీనా ఫెయిత్ హోమ్ ఆధ్వర్యంలో మామిడికుదురులో ఏర్పాటు చేసిన మొబైల్ మజ్జిగ చలివేంద్రాన్ని స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వెంకటేష్ ప్రారంభించారు. వేసవి సీజన్ ముగిసే వరకు మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఈ మజ్జిగ చలివేంద్రం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఫెయిత్ హోమ్ సభ్యులు పాల్గొన్నారు.

నల్లచెరువులో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 26 తేదీ వరకూ స్వామికి విశేష పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం స్వామివారి ఆలయంలో ధ్వజారోహణం, యాగశాల కైంకర్యాలు, నవకుంభారాధన, ఊంజల్ సేవ, తిరుచ్చి వాహన సేవ, శుద్ధి, ఏకాంతసేవ వంటి విశేష పూజలు జరిపారు. ఆలయ నిర్మాణ దాత వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు జరిపారు.

కూటమికి ఓటేస్తే సంక్షేమం గోవిందా

అంబాజీపేట: రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటేస్తే సంక్షేమానికి తిలోదకాలు ఇస్తారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని ఉత్తర్వులు వచ్చాయని పీకే రావు మంగళవారం వివరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాటలు నమ్మితే నట్టేట ముంచేస్తాడని హెచ్చరించారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలంటే జగన్‌ను మరోసారి సీఎం చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి వచ్చే ఆదరణ చూసి చంద్రబాబు అండ్ బ్యాచ్ ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఎన్డీఏ కూటమికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయా జిల్లాల్లో ప్రచారం అయిన అనంతరం బ్రాహ్మణ సంఘాలతో సమావేశం నిర్వహిస్తామన్నారు.

రఘురామకృష్ణరాజుకు ఓటమి తప్పదు



నరసింహరాజు

మామిడికుదురు: ఉండి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రఘురామకృష్ణరాజుకు ఓటమి తప్పదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నరసింహరాజు మంగళవారం జోస్యం చెప్పారు. నరసాపురం నుంచి పోటీ చేస్తానంటూ గొప్పలు చెప్పుకున్న రఘురామకృష్ణరాజు కాళ్లా వేళ్లా పడి ఉండి స్థానానికి పరిమితమయ్యారన్నారు. విలువలు లేని చంద్రబాబు ఉండిలో ముగ్గురు క్షత్రియుల మధ్య చిచ్చు పెట్టారన్నారు. ఉండిలో రఘురామకృష్ణరాజును ఓడించేందుకు స్థానిక ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ క్షత్రియులకు ఉన్నత స్థానం కల్పించారని, క్షత్రియులు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారని నరసింహరాజు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన చిట్టిబాబు

మామిడికుదురు: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరానని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు.

అభివృద్ధి చేస్తా ఆశీర్వదించండి



పోతాయిలంకలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు

అంబాజీపేట: ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అందరికీ ఆదర్శంగా గ్రామాలను అభివృద్ధి చేస్తా... ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు కోరారు. మాచవరం శివారు పోతాయిలంకలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్వర్యంలో సోమవారం రాత్రి ముఖ్యనాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు భరోసా ఇచ్చిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని ప్రజలంతా తనకు సహకరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అమలాపురం ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాదరావులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలపించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి హరి, ఉందుర్తి నాగబాబు, అప్పన శ్రీను, మట్టపర్తి యజ్ఞశ్రీ, గుత్తుల శ్రీను, కాండ్రేగుల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆలమూరు: నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం మండలంలోని చొప్పెల్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా చొప్పెల్ల, చెముడులంక, బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాలకు సంబంధించి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. ట్రాన్స్‌కో ఏఈ వై.లక్ష్మి, లైన్ ఇన్‌స్పెక్టర్లు వాసంశెట్టి సత్యనారాయణ, సుబ్రహ్మణ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరువు కోసమే ప్రతిపక్షాల ఆరాటం

- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక, గొల్లపల్లి
- భారీగా ఎంపీ అభ్యర్థి రాపాక నామినేషన్ ర్యాలీ
- స్వగ్రామం చింతలమోరి నుంచి ప్రారంభం



చింతలమోరిలో భారీ ర్యాలీలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక వర ప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: వచ్చే అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో పరువు కోసమే ప్రతిపక్షాలు ఆరాట పడుతున్నాయని అమలాపురం, ఎంపీ, రాజోలు ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ అభ్యర్థులు రాపాక వర ప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావులు పేర్కొన్నారు. అమలాపురం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు నామినేషన్ ర్యాలీ రాజోలు నియోజక వర్గంలో మంగళవారం భారీ ఎత్తున జరిగింది. అమలాపురం తరలి వెళ్లేందుకు రాపాక స్వగ్రామం చింతలమోరికి నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు తరలి వచ్చారు. ర్యాలీనుద్దేశించి ఇరువురూ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్ని కుట్రలు చేసినా విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. ప్రతి పక్షాల విమర్శలను ప్రజలు కూడా పట్టించుకోవడం లేదన్నారు. గడచిన ఐదేళ్లుగా సీఎం జగన్ చేసిన అభివృద్ధిని చూసి తిరిగి ఆయనను సీఎంగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. చంద్రబాబు బూటకపు వాగ్దానాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. తొలుత రాపాక దంపతులు స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరికాయ కొట్టి గ్రామస్తుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం రాపాక ప్రచార వాహనం ఎక్కారు. ఉదయం 9.30కు ర్యాలీ బయలుదేరింది. వేలాది మంది తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. మోరిపోడు, మోరి, మలికిపురం, విశ్వేశ్వరాయపురం, గుడిమెళ్లంక, మేడిచర్లపాలెం, శివకోడు మీదుగా రాజోలు మీదుగా ర్యాలీ సాగింది. నాయకులు కేఎస్ఎన్ రాజు, బొంతు రాజేశ్వరరావు, చంటిరాజు, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, జంపన బుజ్జిరాజు, రుద్రరాజు చిన్నరాజా, మంగెన సింహాద్రి, అడబాల వీర బ్రహ్మాజీరావు, ముత్యాల కాశీ, గొల్లపల్లి శ్రీధర్, యెనుముల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి రాపాకకు ఘన స్వాగతం

మామిడికుదురు: నామినేషన్ వేసేందుకు వెళ్తున్న అమలాపురం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు మామిడికుదురులో పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య స్వగృహం వద్ద మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు హాజరయ్యారు. ప్రచారం రథంపై రాపాకతో పాటు రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ సీనియర్ నేత బొంతు రాజేశ్వరరావు నిల్చున్నారు. స్వాగతం పలికిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి, నయినాల సీతామహాలక్ష్మి, వర్ధినేని రాము, గెద్దం రాంబాబు, చేట్ల సత్యనారాయణ, ఉచ్చుల విష్ణు, రాయుడు నాగేశ్వరరావు, నయినాల రామకృష్ణ తదితరులు ఉన్నారు.



మామిడికుదురులో ఎంపీ అభ్యర్థి రాపాకకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

39 మంది వలంటీర్ల రాజీనామా

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గ పరిధిలోని మామిడికుదురు, మగటపల్లి గ్రామాలకు చెందిన 39 మంది వలంటీర్లు మంగళవారం తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిని రెండో సారి సీఎం చేసేందుకు తామంతా సిద్ధం అంటూ రాజీనామా చేసిన అనంతరం వలంటీర్లు పేర్కొన్నారు. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు మద్దతుగా ఎన్నికల్లో ఇక నుంచి తాము ప్రత్యక్షంగా ప్రచారం చేస్తామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ పట్ల అనుచితంగా మాట్లాడుతున్నారని, వారి మాటలు తమను తీవ్ర మనో వేదనకు గురి చేస్తున్నాయన్నారు. ఇక నుంచి ప్రతి ఇంటికి తిరిగి వైఎస్సార్ సీపీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొంటామన్నారు. గోగన్నమఠం గ్రామానికి చెందిన 27 మంది వలంటీర్లు సోమవారం రాజీనామాలు చేశారు.



మగటపల్లిలో రాజీనామా పత్రాలను ప్రదర్శిస్తున్న వలంటీర్లు

మోరిలో..

సఖినేటిపల్లి: మండలంలోని మోరిలో గ్రామ వలంటీర్లు కొంత మంది మంగళవారం స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారు. ఇక నుంచి నేరుగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలుగా కొనసాగుతామన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో పర్యాయం ముఖ్యమంత్రిగా చేయడమే తమ లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను కార్యదర్శికి వారు అందజేశారు.

మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రచారానికి విశేష ఆదరణ

ఆలమూరు: వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి అధికారంలోకి తీసుకురావాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గత ఐదేళ్లలో కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించేందుకు తామంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ సీఎంగా జగన్‌ను, ఎమ్మెల్యేగా జగ్గిరెడ్డిని గెలిపించుకుంటామని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలు నినదించారు. మండలంలోని సూర్యారావుపేట, చింతలూరు, సంధిపూడి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, పార్టీ నేతలు నామాల శ్రీనివాసు, మోటుపల్లి వెంకన్న, కదలి ఉపేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తమ ప్రచార రథంపై ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే సోమవారం రాత్రి పెదపళ్ల, పినపళ్ల గ్రామాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారం విశేషంగా ఆకట్టుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా వీధి వీధినా పర్యటించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి గ్రామస్తులంతా అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పర్యటన అనంతరం ఆయా గ్రామాల్లోని స్థానిక నాయకులు ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు ఫ్యానుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పేదల పక్షపాతి, సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌ను రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలనే ఏకైక లక్ష్యంలో నిరాశ, నిస్పృహతోనే చంద్రబాబు, తన మంది మాగదులతో అనైతిక కూటమిని ఏర్పాటు చేసి ఆచరణ సాధ్యం కాని హామీలను ఇస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, నెక్కంటి వెంకట్రాయుడు, నల్లి రాజు, పోలాబత్తుల చిన్న, చింతపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




సంధిపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి

గౌడ కులస్తులకు వైఎస్సార్ సీపీలోనే ప్రాధాన్యం

ఆలమూరు: రాష్ట్ర వ్యాప్తంగా గౌడ సామాజిక వర్గీయులకు వైఎస్సార్ సీపీలోనే అధిక ప్రాధాన్యం లభిస్తుందని కొత్తపేట ఎంపీపీ, గౌడ సంఘం నేత మార్గని గంగాధరరావు అన్నారు. మండలంలోని జొన్నాడలో మంగళవారం గౌడ సంఘ సీనియర్ నేత ఆనెం వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ గౌడ సంఘ ఆత్మీయ సమావేశంలో ఎంపీపీ గంగాధరరావు పాల్గొని ప్రసంగించారు. వచ్చే నెలలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఐదు ఎమ్మెల్యే సీట్లు కేటాయించడంతో పాటు స్థానిక సంస్థల్లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గౌడ సంఘ సోదరులందరూ తమ కుటుంబ సభ్యుల చేత వైఎస్సార్ సీపీనే బలపర్చాలని కోరారు. నియోజకవర్గంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డిని నాలుగోసారి మళ్లీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీపీ గంగాధరరావును గౌడ సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. సంగెడ్డ రంగారావు గౌడ్, మార్గని వీరబాబు, మార్గని యేసు, దాసరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహినీ కేశవ స్వామికి చక్రస్నానం



ప్రత్యేక అలంకరణలో జగన్మోహినీ కేశవ స్వామి

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి చక్రస్నాన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి చక్రస్నానాన్ని గ్రామ సమీప గోదావరి కాలువలో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి విష్వక్సేనపూజ తదితర పూజలను వేదపండితులు, ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి చక్రస్నానం కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మండల టాపర్లకు కలెక్టర్ సన్మానం

మామిడికుదురు: పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులను అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం అభినందించారు. అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఇద్దరు విద్యార్థినులను సన్మానించారు. పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గిడుగు శ్రీరామదుర్గ (590), మొగలికుదురుకు చెందిన బొంతు హర్షిత (590) మార్కుల వంతున సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇద్దరు విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులను కలెక్టర్ సన్మానించారు. కలెక్టర్ ఆమెను అభినందించారు. ఆమె తండ్రి సత్యనారాయణ, ఆయా స్కూల్స్ హెచ్‌ఎంలు కె.హరనాథ్, చక్రవర్తి పాల్గొన్నారు.

కొత్తపేట: మండలంలోని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నూకపేయి నవనీత్‌ను పాఠశాల తరఫున ఘనంగా సత్కరించారు. సోమవారం విడుదలైన పది ఫలితాల్లో నవనీత్ 593 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన విషయం తెలిసిందే. మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం కె.అరుణశ్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నవనీత్‌ను శాలువా, పూలమాల, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. నవనీత్ తల్లిదండ్రులను అభినందించారు.



పెదపట్నంలంక విద్యార్థిని శ్రీరామదుర్గను అభినందిస్తున్న కలెక్టర్ శుక్లా

సఖినేటిపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 579 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన సఖినేటిపల్లి గీతామందిరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోటిపల్లి నేహా శ్రీని ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్ మంగళవారం అభినందించారు. అలాగే మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో 577 మార్కులతో రెండో స్థానం సాధించిన అడబాల జగతిని, 575 మార్కులతో మూడో స్థానం సాధించిన గంటి దేవీని ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ అభినందించారు.

సత్యనారాయణ నామినేషన్

పి.గన్నవరం: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మంగళవారం నలుగురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లు ధాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. జనసేన పార్టీ అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ రెండు సెట్లు, జై భీమ్ రావు భారత్‌పార్టీ అభ్యర్థిగా దుక్కిపాటి విజయచంద్ర, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఇసుకపట్ల ఇమ్మానుయేలు కుమార్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా కోట బాలకృష్ణ ఒక్కో సెట్ వంతున నామినేషన్లు వేశారు. జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ వెంట అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వైభవంగా జరిగింది. ఆంజనేయుడికి ప్రీతికరమైన రోజైన మంగళవారం హనుమాన్ జయంతి రావడంతో ఈ పర్వదినానికి ప్రాధాన్యం సంతరించుకుంది. వేకువజాము నుంచే భక్తులు ఆంజనేయస్వామి ఆలయాలకు చేరుకుని విగ్రహాన్ని సింధూర తిలకంతో అలంకరించి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెదపళ్లలో వేంచేసిన ఆంజనేయ స్వామి ఆలయంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు జరిగాయి. హనుమాన్ జయంతి పురస్కరించుకుని పలు ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



పెదపళ్లలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రోడ్డు ప్రమాదంపై కేసు

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో ఈనెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయాలపాలైన నేపథ్యంలో ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. బండారులంక గ్రామానికి చెందిన పొన్నమండ శ్రీను, మధుబాల దంపతులు ఈనెల 21న ఊడిమూడిలో శుభకార్యానికి బైక్‌పై వస్తున్నారు. ముంగండ కళాశాల మలుపు వద్ద గన్నవరం నుంచి వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొట్టిందని ఎస్సై వివరించారు. దీంతో గాయాల పాలైన భార్యాభర్తలను అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.